రూపాయలు పెట్టి బాల్‌పెన్నుకొని కాపీలు తెప్పించలేదూ'' ఇటువంటివి రికార్డు చేసుకోవడంలో మా సుబ్బారావు ఘనుడు.

నేను కాపీలు తెప్పించనండి, మీరు యేమయినా చేసుకోండి. పదిరూపాయల చొక్కాకి మూడు రూపాయలు క్షవరమా?''

ఇంక మేము చేసేదేముంది? పూర్తిగా క్రమశిక్షణ చర్యకు కూడా లెక్కచేయని రాజకీయ నాయకుడిలా ఆయన మాట్లాడేడు. అందరం నోళ్ళు మూసుకున్నాము. దానితో మా సెక్షన్‌లో అనాదిగా వస్తున్న "కాఫీలు తెప్పించటం'' అనే ఆచారం రద్దు అయింది.

—o—

## ఎదురు తిరిగిన 'కాకా'

దేనికైనా సమయం సందర్భం వుండాలి అంటారు పెద్దలు, "కానీ అంతా మన తెలివితేటలమీద ఆధారపడివుంటుంది'' అంటాడు మా ఆఫీసులో కొత్తగా చేరిన సుబ్బారావు.

ఆ రోజు మా ఆఫీసులో చాలా సందడిగా వుంది. కారణం ప్రమోషన్లకోసం లిస్టులు పంపమని హెడ్ ఆఫీసునుంచి ఫోన్‌వచ్చింది. ప్రమోషన్లు కావాలంటే ఎలాగోలాగ తంటాలుపడి తనపేరు అందులో ఎక్కించుకునేలా చెస్తేసరి అనుకుంటున్నాడు సుబ్బారావు.

"మన బాస్‌తో ప్రమోషన్ లిస్టు విషయం నేనువెళ్ళి చెప్పుకోనా'' అన్నాడు సుబ్బారావు ఆఫీసు టైపిస్టుతో. టైపిస్టు ఇంటర్నేషనల్ లెవల్లో ఫోజుపెట్టి "మన బాస్ మూడ్ కనిపెట్టి వెళ్ళాలయ్యో! ఎందుకయినామంచిది బాస్‌దగ్గర అటెండర్ బాలయ్యని అడిగిచూడు'' అన్నాడు.

దానికి సుబ్బారావు మండిపడి "బాలయ్యాలేడు గీలయ్యాలేడు. నేను ఎంతటివాడినయినా బుట్టలో పడెయ్యగలను. నువ్వే చూస్తావుగా''అన్నాడు.

"ఆమాత్రందానికి నన్నెందుకు గురూ అడిగావు? గో. ఎ. హెడ్. విష్ యూ గుడ్‌లక్'' అన్నాడు టైపిస్టు.

మర్నాడు ఆఫీసులో—

ఉరిశిక్షవేసిన ఖైదీని "అబ్బాయి కొన్ని క్షణాలలో నువ్వు చచ్చిపోతావు కదా నీ ఆఖరి కోరిక ఏమిటి?'' అని ఉరికంబం దగ్గర అడిగే

పోలీసుపీసాసరులాగ బాస్ ఉన్నాడు. ఉరిశిక్షపడిన ఖైదీలాగ సుబ్బారావు నిలబడి ఉన్నాడు బాస్ గదిలో.

"అదిసరే మా ఇంటిదగ్గర ఎవరు నీకు కనిపించింది?" గంభీరంగా అడిగారు సుబ్బారావుని బాస్.

"అయ్ తమరి అమ్మాయి గారండి. నాన్నగారున్నారా ? అన్నారండి. "ఆమె చెప్పలేదండీ, సిగ్గుపడిపోయారండి ఆమెగార్కి నా ప్రమోషన్ సంగతి చెప్పండని నా సంతోషంకొద్దీ నేను తీసుకువెళ్ళిన చిరు కానుకలు అక్కడ పెట్టేసి వచ్చేసేనండయ్యా"

"అయితే నీకు కనిపించినమ్మాయి నా కూతురేనంటావు"

"లక్షణంగానండి. అంతా తమ తీవే ఫక్తు రాకుమారిలా వున్నారండి" "ఇంతకూ నీకేం కావాలి?"

చొక్కా పైకెత్తి నలుపుకుంటూ "పై ఆఫీసుకు ప్రమోషన్లకు పంపించే లిస్టులో నా పేరుకూడా పంపిస్తే తమపేరు చెప్పుకుని యాపీగా వుంటానండి" అన్నాడు సుబ్బారావు.

"మిస్టర్ సుబ్బారావు! యూ ఆర్ అన్‌ఫిట్ ఫర్ ప్రమోషన్. "నా యూ కెన్‌గో" ఖంగుమంది బాస్ కంఠం.

"సర్" అతని మాటలు పూర్తికాలేదు, ఆయన ఇంకా కోపంగా అన్నారు.....

"ఇంకో విషయం. ఇంకెప్పుడూ మా ఇంటి ఛాయలకు వెళ్ళకు దిసీజ్ లాస్ట్‌వార్నింగ్ టుయూ" అని అరచినంత కరిచినంత పనిచేశారాయన.

పులివాత తప్పించుకున్న బక్కజంతువులాగ బయటపడ్డ సుబ్బారావుకు తలుపుదగ్గరే సైపిస్టు ఎదురై "ఏమిటి బాస్‌ని ప్రసన్నం చేసుకున్నావా? అని అడిగాడు.

"అదేటిరా బాబూ! కూతుర్ని పొగిడితే గెటవుట్ అంటాడు."

"అదికాదు డబ్బారేకుల సుబ్బారావూ! ఆమె మనబాస్ మూడో ముద్దుల భార్య" అంతే! ఆ మాట వినగానే సుబ్బారావు కిందపడిపోయాడు. అతనలా పడిపోతూ ఉండగానే సైపిస్టు అంటున్నాడు; "ఈ బాస్ వున్నాళ్ళు నీ జాతకం ఇంతేసంగతులు"

.....0.....